ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

3★★★

బుధవారం 24 జనవరి 2024

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి 6లో..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి 6లో..



ఆపదలో ఆడపిల్ల

- **జిల్లాలో గతేడాది 44 పోక్సో కేసులు నమోదు**
- **ఆగని భ్రూణహత్యలు**
- **జిల్లాలో వెయ్యి మంది బాలురకు 942 మంది బాలికలు**
- **జిల్లాలో అరు సంవత్సరాల లోపు 23,652 మంది బాలికలు**
- **నేడు జాతీయ బాలికల దినోత్సవం**

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బిడ్డ జన్మ తల్లికి పునర్జన్మ... తల్లి అనిపించుకోవడానికి ప్రాణాలను సైతం లెక్కచేయదు. మాతృత్వం ఒక మహత్తరమైన అనుభూతిగా భావిస్తారు. మనకు జన్మనిచ్చే అమ్మరూపమే ఆపదలో పడుతుంది. బాలిక లోకం అయోమయంలో చిక్కింది. మహిళలు పురుషులతో సమానమే అని చట్టాలు, పాలకులు చెపుతున్నా గర్భంలోనే ఆడపిల్ల అని తెలవగానే హత్యలకు గురవుతున్నారు. కాగితాలకే చట్టం పరిమితమైపోయింది. ఒకప్పుడు ఆడపిల్ల అంటే మా ఇంటి మహాలక్ష్మిగా భావించేవారు. ఇప్పుడు మగపిల్లాడే వంశోద్ధారకుడని భావించి, ఆడపిల్ల అక్కరలేదన్నట్లుగా భ్రమల్లో పడిపోయారు. బాలికల మనుగడలో భద్రత లేకుండా పోయింది. ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలు, పథకాలు, వారి దరిచేరడం లేదు. బాలికలు చదువుల్లో ముందు వరుసలో నిలుస్తున్నా ఉన్నత చదువులకు మాత్రం తక్కువ సంఖ్యలోనే వెళ్తున్నారు. రాజకీయంగా, వ్యాపార రంగాల్లో, ఉన్నత ఉద్యోగాల్లో మహిళలు రాణిస్తున్నారు. కానీ ఇంకా వంటింటికి పరిమితం చేయాలనే ఆలోచనలోంచి తల్లిదండ్రులు, తోడుగా ఉండే భర్త సైతం బయట పడడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో, గిరిజన తండాల్లో బాలికలు తీవ్ర వివక్షకు గురవుతున్నారు. బాలికల శాతం తగ్గిపోతుండడంతో బాలికల గౌరవం పెంచడానికి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడానికి కేంద్ర బాలిక శిశుసంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

● పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

జిల్లాలో బాలికల దినోత్సవం సందర్భంగా వారి హక్కులను విస్తృతంగా ప్రచారం చేసే దిశగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ఆవిష్కరించారు. ఇదే సందర్భంలో బాలికలను రక్షిద్దాం, చదివిద్దాం అంటూ జిల్లా అధికారులు ప్రతిజ్ఞ కూడా చేశారు.

పుత్తడి బొమ్మకు పుస్తెల భారం...

ప్రజల్లో అవగాహన పెంచినా పుత్తడి బొమ్మలకు పుస్తెల భారం తప్పడం లేదు. చదువుకునే వయస్సులో బాలికలకు వివాహాలు చేస్తూ బాధ్యల బరువును అప్పగిస్తున్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ఉన్నా గుట్టుచప్పుడు కాకుండా జిల్లాలో బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా 2022 వరకు 50 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. రోజురోజుకు బాల్య వివాహాలు పెరుగుతూనే ఉన్నాయి. 2017లో రెండు వివాహాలు, 2018లో ఏడు, 2019లో 11 వివాహాలు, 2020లో 11 వివాహాలు, 2021లో ఏడు వివాహాలు, 2022లో 12 వివాహాలు, 2023లో 13 బాల్య వివాహాలను నిలిపివేసి అవగాహన కల్పించారు. మరోవైపు భ్రూణహత్యలు కూడా ఆగడం లేదు. బాలికల నిష్పత్తి తగ్గిపోతున్నా డయాగ్నోస్టిక్ కేంద్రాలపై నిఘా ఉన్నా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మొగ్గలోనే ఆడపిల్ల గొంతునులిమి చంపేస్తున్నారు.

స్మైల్ ముస్కాన్ ద్వారా చేయూత

ప్రతీ సంవత్సరం జనవరిలో అపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తూ బడి బయట ఉండి బాల కార్మికులుగా, భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతున్న వారిని రెస్క్యూ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2017 నుంచి 2024 జనవరి వరకు 598 మందికి చేయూతను అందించగా జిల్లాలో బాల రక్షక్ వాహనాన్ని ఏర్పాటు చేసి నిత్యం సేవలు అందిస్తున్నారు.

మహిళలకు రక్షణగా అభయ యాప్

జిల్లాలో మహిళలు, బాలికలకు భద్రతగా పోలీసులు అభయ యాప్‌ను రూపొందించారు. అభయ షై ట్యాక్సీ సేఫ్ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చి జిల్లాలో నాలుగు వేల ఆటోలకు అనుసంధానం చేశారు. బస్సులో భరోసా కార్యక్రమంతో సీసీ కెమెరాలను అమర్చారు. మరోవైపు కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఆపరేషన్ జ్వాల కార్యక్రమాలను అందించారు. అంతే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. రెండు రోజుల క్రితం సిరిసిల్లలోని మెడికల్ కళాశాల విద్యార్థులు ఫ్లాష్ మాబ్ ద్వారా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలపై అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు.

బాలికల కోసం ఉన్న చట్టాలు..



- 17వ శతాబ్దంలో అమెరికా, బ్రిటన్‌లో బాలలను పరిశ్రమలో పని చేయించేవారు. 18వ శతాబ్దాంలో బాలలను పనిముట్లుగా కాకుండా భవిష్యత్తుకు పనికి వచ్చే శక్తిగా తయారు చేయాలని ప్రపంచ దేశాలు గుర్తించాయి.
- 19వ శతాబ్దంలో బాల కార్మికుల పరిస్థితిపై ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు మొదలు పెట్టాయి.
- 1872లో ఇతర దేశాల్లో నిర్బంధ విద్య మొదలైంది. 1882లో భారతదేశంలో నిర్బంధ విద్య చట్టం ప్రారంభించాలని సూచనలు జరగగా 1945లో మొదలైంది.
- 1881లో కర్మాగారాల్లో పనిచేసే బాల కార్మికుల కనీస వయస్సు ఏడు సంవత్సరాలుగా నిర్ధారించారు.
- 1920లో అంతర్జాతీయ కార్మిక సంస్థ బాలకార్మికుల చట్టాలను రూపొందించింది.
- 1922లో బాలకార్మికుల వయస్సు కనీసం 15 సంవత్సరాలుగా నిర్ణయించారు. గనుల్లో పనిచేసే బాలల వయస్సు 13 సంవత్సరాలుగా నిర్ణయించారు.
- 1933లో నిర్బంధ చాకిరిని రద్దు చేసింది.
- 1938లో బాలల ఉద్యోగ చట్టం వచ్చింది.
- 1987లో కుటీర పరిశ్రమల్లో, కుటుంబం నిర్వహించే వృత్తుల్లో బాలబాలికలు పనిచేసే వీలు కల్పించింది.
- 1951 తేయాకు కాఫీల చట్టం వచ్చింది. అందులో బాల బాలికల వయస్సు 12 సంవత్సరాలుగా నిర్ధారించారు.
- 1954 చట్టం ప్రకారం 17 సంవత్సరాల్లోపు బాలలను రాత్రిపూట పనికి నిషేధించారు.
- 1966లో బీడి చుట్టల చట్టం ప్రకారం 14సంవత్సరాలలోపు పిల్లలను వినియోగించ వద్దని నిషేధం.
- 1966లో బాల కార్మిక నిషేధ చట్టం.

● అత్యాచారాలు, లైంగిక వేధింపులు..



చిన్నారులనీ చూడకుండా బాలికలపై అత్యాచారాలు, లైంగిక వేదింపులు మిస్సింగ్‌లు తప్పడం లేదు. సైబర్ నేరాల్లో సైతం బాలికలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో గతేడాది బాలికలపై అఘాయిత్యాల సంఘటనల్లో 44 మందిపై పోక్సో కేసులు నమోదు చేశారు. 2022లో 60 కేసులు నమోదు కావడం గమనార్హం. వీటితో పాటు మహిళ వేధింపుల్లో 2022లో 346 కేసులు నమోదు కాగా గత సంవత్సరం 282 కేసులు నమోదు చేశారు. పోక్సో కేసుల్లో బాధితులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం అందిస్తున్నారు. జిల్లాలో 2017 నుంచి 2023 వరకు 120 మంది పోక్సో బాధితులకు రూ 50.15 లక్షల అర్థిక సాయాన్ని అందించారు.

బాలబాలికల్లో భారీ వ్యత్యాసం

జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5,52,037 మంది జనాభా ఉన్నారు. ఇందులో పురుషులు 2,74,109 మంది, మహిళలు 2,77,928 మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పురుషులు 2,15,791 మంది, మహిళలు 2,19,354 మంది, పట్టణ ప్రాంతాల్లో పురుషులు 58,318 మంది, మహిళలు 58,574 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 3,819 మంది ఎక్కువగా ఉన్నారు. బాలికల నిష్పత్తిలో మాత్రం తేడా ఉంది. ఆరు సంవత్సరాల్లోపు పిల్లల జనాభా 48,751 మంది ఉండగా బాలురు 25,099 మంది, బాలికలు 23,652 మంది ఉన్నారు. ఇందులో 1,449 మంది బాలికలు తక్కువగా ఉన్నారు. నిష్పత్తిలో 1000 మంది బాలురకు 942 మంది బాలికలు ఉన్నారు. పాఠశాలలో చదువుతున్న వారు ప్రస్థుతం 37,754 మంది ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు : జడ్పీ చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతన్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఆదేశించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ కార్యాలయంలో 2024-2025 సంవత్సరం జిల్లా అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులకు సంబంధించి అభివృద్ధి పనులపై ప్రణాళికాబద్ధంగా నివేదికలు ఉండాలని కోరారు. సమావేశంలో జడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, జడ్పీటీసీలు లక్ష్మణ్‌రావు, నర్సయ్య, కుమార్, విజయ, కళావతి, మీనయ్య, ఉమ, రవి, వాణి, ఎంపీపీలు రేణుక, బూల, చంద్రయగౌడ్, లావణ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

బాల సాహితీవేత్త డాక్టర్ రాణీప్రసాద్‌కు సన్మానం



సన్మానిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బాల సాహితీవేత్త, సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందేపీ రాణీప్రసాద్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించిన సందర్భంగా కవులు, రచయితలు ఘనంగా సన్మానించారు. మంగళవారం సిరిసిల్లలోని సృజన్ హాస్పిటల్‌లో మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో రాణీప్రసాద్‌ను సన్మానించారు. సాహిత్య రంగంతో పాటు వేస్ట్ మేటీరియల్‌తో ఎన్నో అకృతులకు జీవం పోస్తూ కళారూపాలు సృష్టిస్తున్నారని అభినందించారు. పర్యావరణం, సైన్స్ పట్ల రాణీప్రసాద్ కృషి అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో మానేరు రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రధాన కార్యదర్శి అడెపు లక్ష్మణ్, రచయితలు జిందం అశోక్, గణేష్, వంశీ పాల్గొన్నారు. కేంద్ర బాల సాహిత్య అవార్డు గ్రహీత పత్తిపాక మోహన్ అభినందనలు తెలిపారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ దండె విఠల్

వేములవాడ, జనవరి 23: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యుడు దండే విఠల్ దర్శించుకున్నారు. మంగళవారం నాడు ఆయన కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఎమ్మెల్సీని అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు.

ముంపు గ్రామాల యువత

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 23: జిల్లా వ్యాప్తంగా వున్న ముంపు గ్రామాల్లోని యువత ప్రభుత్వం అందించే నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్ సూచించారు. వేములవాడ మండలం చీర్లవంచ, కొడుముంజ గ్రామాల్లో మంగళవారం నాబార్డ్ సౌజన్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ ముంపు గ్రామాల్లోని యువత ప్రభుత్వం అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాబార్డ్ ఆధ్వర్యంలో మహిళా సభ్యులకు, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, లైవ్లీహుడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించబడతుందని, ఎంపికైన వారికి ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులకు 15 రోజుల శిక్షణ కార్యక్రమాలలో మధ్యాహ్నం భోజన సదుపాయంతో పాటు స్టైఫండ్ అందించనున్నామని అన్నారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలలోపు వయస్సుగల 10వ తరగతి పాస్, ఫెయిల్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బిటెక్, టెక్నికల్ అర్హతలు గల నిరుద్యోగ యువతీ యువకులకు ఎంపిక చేసకున్న నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. అవకాశాన్ని ముంపు గ్రామాల్లోని ప్రజలు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్స్‌కు క్రీడా పోటీలు

సిరిసిల్ల టౌన్, జనవరి 23 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సీనియర్ సిటిజన్స్‌కు జిల్లా స్థాయిలో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్నామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్లలో ఆయన మాట్లాడుతూ బుధవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో వివిధ క్రీడలు, గురువారం సిరిసిల్ల టౌన్‌క్లబ్‌లోని ఇండోర్ స్టేడియంలో ఇండోర్ గేమ్స్ నిర్వహిస్తామన్నారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు 26న బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. జిల్లాలోని సీనియర్ సిటీజన్స్ పెద్దసంఖ్యలో పాల్గొని క్రీడలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ సీనియర్ సిటీజన్స్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కోశాధికారి దొంత దేవదాస్, నాయకులు గజ్జెల్లిరామచంద్రం, ఆంకారపు జ్ఞానోబా పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

వీర్నపల్లి, జనవరి 23 : వీర్నపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జిల్లెల్ల రమేష్‌ను బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి పిట్ల నాగరాజు నాయకులతో కలిసి మంగళవారం సన్మానించారు. మారుమూల గ్రామాల ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



మరిమడ్లలో అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్‌వాడీ కేంద్రం

కోనరావుపేట, జనవరి 23: మండలంలోని మరిమడ్ల గ్రామంలోని అంగన్‌వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో అంగన్‌వాడీ సెంటర్ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. మరిమడ్ల గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఒక అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం ఉంది. మరో కేంద్రానికి భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం నాలుగు లక్షల రూపాయలు మంజూరు చేసింది. కానీ ఆ నిర్మాణం నత్తనడక నడవడంతో అంగన్‌వాడీ సెంటర్ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. భవనం పూర్తి చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తిచేసి, కేంద్రాన్ని పక్కా భవనంలోనికి మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, జనవరి 23 : వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం నాడు భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్కసారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం నాడు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే నైవేద్యం వండి బోనం తయారుచేశారు. ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.



బోనాలతో బారులుదీరిన భక్తులు

గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి
- వేడుకల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 23: జిల్లాలో గణతంత్ర దినోత్సవ నిర్వహణకు అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలపై జిల్లా అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమిలతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు చేయాలన్నారు. అన్నిగ్రామాల్లో వేడుకలు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత ఎంపీడీవోలు, తహసీల్దార్లదేనని సూచించారు. అన్ని విద్యాసంస్థల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసేలా జిల్లా విద్యాధికారి తగు అదేశాలు జారీ చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవం రోజు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో భారీగా ఏర్పాట్లు చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిలకు సూచించారు. వేడుకలకు సంబంధించిన ప్రొటోకాల్ పాటిస్తూ సీటింగ్‌లను ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం జిల్లాలోని వీఐపీలందరికీ తప్పనిసరిగా గణతంత్ర వేడుకల ఆహ్వాన పత్రికలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గణతంత్ర దినోత్సవ సంక్షిప్త సందేశాన్ని సిద్ధం చేయాలని డీపీఆర్వో మామిండ్ల దశరథంకు సూచించారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించాలని నిర్ణయించామని ఇందుకు అనుగుణంగా ప్రతీ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు జనవరి 24 వతేదీలోగా కలెక్టరేట్ ఏవో కు అందించాలని సూచించారు.

● సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి..

సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు బండ్ పార్క్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులతో దేశభక్తి, జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వంను పెంపోందించే నృత్యప్రదర్శనలు ఏర్పాటు చేయాలని విద్యాధికారిని ఆదేశించారు. అక్కడే పోషకాహార ప్రాముఖ్యం, చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని తెలియజేసేలా మిల్లెట్ ఫుడ్‌ఫెస్టివెల్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్, సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ మోహినోద్దీన్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

● ఫిబ్రవరిలో రాజన్న వాలీబాల్ పోటీలు

వచ్చే ఫిబ్రవరిలో రాజన్న వాలీబాల్ చాంపియన్‌షిప్ పేరుతో జిల్లా స్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మినీ సమావేశ మందిరంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సమావేశం నిర్వహించారు. సభ్యులు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఔత్సాహిక బృందాలనుంచి దరఖాస్తులను తీసుకోవాలని ఒక్కో టీం నుంచి వెయ్యి రూపాయల ఫీజు వసూలు చేయాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియాన్ని యువత, ప్రజలను అకర్షించేలా సద్వినియోగం చేసుకునే విధంగా కార్యాచరణ సిద్ధం చేయాలని మున్సిపల్ యువజన క్రీడా అధికారులకు సూచించారు. మినీ స్టేడియం నిర్వహణ క్రీడాకారుల్లో నైపుణ్య అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. క్రీడా నైపుణ్యాల పెంపుదలకు స్టేడియం కేంద్ర బిందువు కావాలన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న మినీస్టేడియం నిర్వహణకు అవసరమైన ఆదాయం కూడా సమకూరే విధంగా చూడాలన్నారు. స్టేడియానికి సంబంధించిన ఎనిమిది దుకాణాలను బహిరంగ వేలం వేసి లీజుకు ఇవ్వాలని అన్నారు. బహిరంగ వేలానికి ఎవరూ ముందుకు రాకపోతే కౌన్సిల్ తీర్మానంతో నిర్ణీత రుసుము నిర్ణయించి కేటాయించాలని అన్నారు. మినీస్టేడియంలో ప్రచార ప్రకటన ద్వారా కూడా ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. స్టేడియంలో ఉడెన్ బ్యాడ్మింటన్ కోర్టు, స్నూకర్, ఇండోర్ క్రీడలకు వచ్చే వారి నుంచి నెలవారి రుసుము వసూలు చేయాలన్నారు. బ్యాడ్మింటన్ మినహా మిగతా అన్నీ ఇండోర్ క్రీడలకు ఒకే కార్డు చందాదారులకు ఇవ్వాలని అన్నారు. స్కేటింగ్‌కు ఉన్న డిమాండ్ దృష్ట్యా కోర్టును తీర్చిదిద్దాలని, అర్చరీ శిక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. స్టేడియానికి సంబంధించి పెండింగ్ విద్యుత్ బకాయిలు చెల్లించాలని అన్నారు. సిరిసిల్ల నెహ్రూపార్కు వద్ద ఉన్న స్విమింగ్ పూల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా క్రీడా అధికారి రాందాస్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాష్, డీఈవో రమేష్, సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ అయాజ్, టీపీవో అన్సారీ పాల్గొన్నారు.











రూ.6,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 23: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,750 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 84మంది రైతులు 676 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 17 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,750, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.



మానకొండూర్ సామిల్‌లో అగ్ని ప్రమాదం

మానకొండూర్, జనవరి 23: మానకొండూర్‌లోని ఓం గణేశ్ సామిల్ లో మంగళవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. సామిల్ లో యజమాని నందగిరి శ్రీనివాస్ రాత్రి 11 గంటల వరకు పని పూర్తి చేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారు జామున ఓ వ్యక్తి సమాచారం ఇవ్వడంతో శ్రీనివాస్ వచ్చి చూసే సరికి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ అధికారికి సమచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. మిల్‌లోని కలపకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని, దీంతో సూమారు రూ. 3లక్షల విలువ గల కలప కాలిపోయిందని శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయంపై పోలీసులు, అగ్నిమాపక అధికారులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.


పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 23: పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు పేర్కొన్నారు. నగరంలోని గణాంకభవన్‌లో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సంఘం రూపొందించిన 2024 నూతన సంవత్సర డైరీని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు ఆవిష్కరించగా, క్యాలెండర్‌ను పెన్షనర్స్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు ఆవిష్కరించారు. మంగళవారం జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎం.బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించి పలు సమస్యలపై చర్చించి తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఎంప్లాయీస్ హెల్త్‌కార్డులను అన్ని ఆసుపత్రుల్లో ఆమోదించి పెన్షనర్ల ఆరోగ్య సమస్యలు పరిష్కరించాలని, పేరివిజన్ కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ఇవ్వాలని, స్పెషల్ టీచర్స్‌గా పనిచేసిన కాలాన్ని సర్వీస్‌లో లెక్కించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ తీర్మానించారు.

ఈ సమావేశంలో వి.చక్రపాణి, ఇ.నర్సింహారెడ్డి, జగన్‌మోహన్, పద్మారావ్, బి.సత్యనారాయణ, పి.లచ్చయ్య, ఇ.నర్సింహ రెడ్డి, వీరస్వామి, పురుషోత్తంరావు, కె.మహేందర్ రాజు, కె.రాజమల్లు, బి.డేనియల్, కె.పురుషోత్తంరావు, సత్యనారాయణ, దేవదారి తదితరులు పాల్గొన్నారు.







నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎ‌స్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాలిటీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాలిటీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాలిటీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌ‌స్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలులుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

సాయిబాబా ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 23: మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని సాయిబాబా ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఆలయంలోని ప్రవేశించిన దొంగలు హుండీని ధ్వంసం చేసి రూ.10 వేల నగదుతో పాటు పంచలోహంతో తయారు చేసిన సాయిబాబా, గోమాత విగ్రహాలను అపహరించుకుపోయారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆలయం వద్దకు కాపల ఉండే వ్యక్తి మరాఠి స్వామి వచ్చి చూసే సరికి తాళాలు పగులకొట్టి కనిపించాయని చెప్పారు. సమాచారం అందుకుని ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని పేర్కొన్నారు. మరాఠి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గంభీరావుపేట, జనవరి 23: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దారవత్ నవీన్(23) అనే యువకుడు మృతి చెందాడు. బైక్‌పై గొల్లపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. లక్ష్మీపూర్ గ్రామనికి సమీపాన్నే నవీన్‌ను కుక్కలు వెంబడించగా, తన బైక్ అదుపు తప్పి, అటువైపు ఉన్న గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్‌ను ఢీకొట్టింది. దీంతో నవీన్‌కు తీవ్ర గాయాలు కాగ, హుటాహుటిన కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రికి వెళ్లే సరికి నవీన్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

● గుర్తుతెలియని వాహనం ఢీకొని మరొకరు..


కాసర్ల కార్తీక్ (ఫైల్)

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక నాలుగు వరుసల వంతెన వద్ద మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని కాసర్ల కార్తీక్ (21) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు గ్రామానికి చెందిన కాసర్ల కార్తీక్ కొత్తపల్లి మండలం బావుపేట గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కొదురుపాక నాలుగు వరుసల అనంతరం వద్ద కార్తీక్ ప్రయాణిస్తున్న వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, జనవరి 23: సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డులోని మెడికల్ కళాశాల సమీపంలో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దూరుకు చెందిన యెల్లకొండ అభిలాష్, పసికంటి విజయ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. మరొక వాహనం పై ఉన్న కళ్లేపల్లి మల్లేశంకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు.

● చందుర్తి మండలంలో..

చందుర్తి: మండలంలోని జోగాపూర్ మంగళవారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం మూడపల్లి గ్రామానికి చెందిన బోయిని శేఖర్ అనే వ్యక్తి సనుగుల నుంచి మూడపల్లి వైపు వస్తున్నాడు. జోగాపూర్ గ్రామానికి చెందిన ఒనగంటి లక్ష్మారెడ్డి అనే వ్యక్తి పొలం వద్ద నుంచి ఇంటికి వస్తుండగా శివాజీ విగ్రహం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికి కాళ్లు విరిగినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు.

రెండు మట్టి టిప్పర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జనవరి 23: మండలంలోని అక్కపల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. తహసీల్ అధికారులకు అప్పగించామని చెప్పారు. ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న చంద్రమౌళి

ఇల్లంతకుంట, జనవరి 23: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడుగా బట్టి చంద్రమౌళిని నియమించినట్టు జిల్లా చైర్మన్ కనకం కుమరస్వామి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని చంద్రమౌళికి అందించారు. అనంతారం గ్రామానికి చెందిన చంద్రమౌళి తెలంగాణ ఉద్యమసమయంలో మండలంలో క్రీయాశీలకంగా వ్యవహరించారు. తన నియమకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

గంభీరావుపేట, జనవరి 23: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట ఎంఈవో ఆఫీస్ ఎదుట మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న సిరిసిల్లలో జరిగే జనరల్ బాడీ సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, 10 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలన్నారు. కార్మికులకు గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు, నిత్యవసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. వచ్చే నెల 4న సిరిసిల్లలో జరిగే సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌పావని, సెక్రెటరీ జంపాల రవీందర్ రానున్నట్టు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు లక్ష్మణ్, మహేశ్వరీ, రేఖ, రాజమణి, లక్ష్మి, మౌనిక ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 23: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హజునాయక్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఉపాధ్యాయ నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హజునాయక్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా ఎస్జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎస్ఏలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు, బదిలీలు చేపట్టాన్నారు. గతంలో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించే లోపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించాలని అన్నారు. ఉన్నతీకరించిన భాషా పండితుల పోస్టులకు పదోన్నతులు కల్పించాలని హజునాయక్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటరమణ, ఆ సంఘం నాయకులు రవి, భరత్, కార్తీలాల్‌నాయక్, తిరుపతి నాయక్, రమేశ్, బాలయ్య, రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఎంవీఐ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, జనవరి 23: రోడ్డు భద్రతపై తంగళ్లపల్లి మండల కేంద్రంలో శుభోదయ హైస్కూల్ విద్యార్థులకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత తదితర అంశాలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ వివరించారు. ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంవీఐ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


గంభీరావుపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు


సిరిసిల్లలో బీజేపీ నాయకులు..

సిరిసిల్ల టౌన్, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయనకు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతీయులందరి హృదయాలలో చిరంజీవిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు దార్నం అరుణలక్ష్మీనారాయణ, చొప్పదండి లలితప్రకాష్, కో అప్షన్ సభ్యుడు ఎండీ సలీం పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు దుబాల వెంకటేశం, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ నేతాజీ సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడురి ప్రవీన్, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్ నేతాజీ సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిర్పించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వివాదం

నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో ప్రొటోకాల్‌పై కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ప్రొటోకాల్ ప్రకారం మున్సిపల్ చైర్ పర్సన్ నేతాజీ విగ్రహానికి పూలమాల వేయాల్సి ఉండాగా ముందుగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేయడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

ఇల్లంతకుంట: ఆజాద్‌హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు రేపాకలో ఘనంగా నిర్వహించారు. గ్రామకూడలిలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం భూపతిరెడ్డి, కార్మిక సంఘ జిల్లాఅధ్యక్షుడు పండుగ శంకర్, నాయకులు మీసాల నరేష్, కామల్ల ఎల్లేష్, మీసాల ఎల్లయ్య, హకీంలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని సుభాస్‌నగర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూల మాలలు వేసి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్, ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యుడు బాబు, నాయకులు నాగరపు దేవేందర్, మీనయ్య, దండవేణి దేవయ్య, ఈ'వేని సత్యం, శ్రీశైలం, ప్రవీన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, ఆంజనేయులు, రవి, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, లక్ష్మణ్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణ భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, నాయకులు గాజుల వేణు, పట్టణ ఉపాధ్యక్షులు ఊరగొండ రాజు, మ్యాన రాంప్రసాద్, గాజుల సదానందం, గుడ్ల విష్ణు, మోర శ్రీహరి, అంకారపు రాజు, మహేశుని అనిల్, కోడం ఆనంద్‌బాబు, రచ్చ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో, స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, వివేకానంద సేవాసమితి సభ్యులు లింగంపెల్లి మధుసూదన్, పంచరుపుల దివ్యసాగర్, శ్రీనివాస్, లోకోజి సతీష్, పోతరాజు మధు, ఎంజాల నరేష్, మూడపెల్లి ముఖేష్, ప్రతిభా విద్యాలయం కరస్పాండెంట్ కొడకంటి గంగాధర్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎడ్ల సాగర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఉపసర్పంచ్ భోయిని రవి, మండల కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, నాయకులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో సుభాస్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్షా వారియర్స్ పుస్తకంలోని మంత్రాలు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా , వికాసిత్ భారత్, అదిత్య ఎల్-1 ఇతివృత్తాలపై విద్యార్థులు చిత్రలేఖలు తీశారు. వీటిని తెలంగాణ గిరిజన వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ అర్ట్స్ అకాడమీ భోధన సిబ్బంది స్వప్న, ప్రభాకర్‌రావు, సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన అక్షయ్య, కేంద్రీయ విద్యాలయానికి చెందిన నిర్వష్ను, శ్రీకృష్ణ స్కూల్‌కు చెందిన దుర్గ ప్రసన్న, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఉర్మిళలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ కేపీ సింగ్ తెలిపారు.



బహుమతులను అందుకున్న విద్యార్థులు

టెక్స్‌టైల్ పార్కులో నేటి నుంచి పూర్తిస్థాయిలో పరిశ్రమలు ప్రారంభం


టెక్స్‌టైల్ పార్కు కార్మికులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

తంగళ్లపల్లి, జనవరి 23: మండలంలోని బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కులో బుధవారం నుంచి పూర్తి స్థాయిలో పరిశ్రమలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వకపోవడంతో మాంద్యం ఉందని యజమానులు తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు బంద్ చేశారు. దీంతో కార్మికులు రోడ్డున పడుతున్నారని ప్రభుత్వం స్పందించి ఆర్డర్ ఇవ్వడంతో ఈ నెల 16వ తేదిన పరిశ్రమలు ప్రారంభిస్తామని యజమానులు ప్రకటించారు. ఈ క్రమంలో పదిహేను రోజులుగా బంద్ పెట్టిన కాలానికి కూలీ ఇవ్వాలని డిమాండ్‌తో పాటు నిరంతరం పని కార్మికులకు కల్పిస్తున్న పరిశ్రమలకు మాత్రమే ప్రభుత్వ ఆర్డర్ ఇవ్వాలని చేనేత జౌళి శాఖ అదికారులకు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చినప్పటికి పరిశ్రమలు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో తెరుచుకోక పోవడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. కొంతమంది కార్మికులకు మాత్రమే పని దొరుకుతుండడంతో పూర్తి స్థాయిలో పరిశ్రమలు నడిపించి కార్మికులందరికి పని కల్పిస్తేనే పనులకు వెళ్లాలని నిర్ణయించుకుని పనులకు వెళ్లకుండా బహిష్కరించారు. దీంతో మంగళవారం కార్మిక సంఘాల నాయకులు, యజమానులు చర్చలు జరిపారు. పూర్తి స్థాయిలో పరిశ్రమలు నడిపిస్తామని హామీ ఇవ్వడంతో బుధవారం నుండి పనులకు వెళ్లలాని కార్మికులు నిర్ణయించుకున్నారు. ఈ విషయంపై కార్మిక సంఘాల నాయకులను, యజమానులను వివరణ కోరగా బుధవారం నుంచి పూర్తి స్థాయిలో పరిశ్రమలు నడిపించనున్నట్లు కార్మికులందరు పనులకు హాజరవుతారని తెలిపారు.

● కమిషనర్ హామీతో మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ..

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ హామీతో పారిశుధ్య కార్మికులు మంగళవారం సమ్మెను విరమించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. మంగళవారం స్పందించిన మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్ అయాజ్ సీఐటీయూ, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. పీఎఫ్ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని, పీఆర్సీ బకాయిలను విడతల వారీగా మార్చి నెల నుంచి అందజేస్తామని కమిషనర్ హామీనిచ్చారు. కార్మికులకు ఈఎస్ఐ కార్డులు, మున్సిపల్ నుంచి ఐడెంటీ కార్డులు అందజేస్తామన్నారు. కార్మికులకు రక్షణ సామగ్రితో పాటు సబ్బులు, నూనెలు, చెప్పులు, బట్టలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. దీంతో కార్మిక సంఘాల నాయకులు సమ్మెను విరమించడానికి అంగీకరించారు. అనంతరం మున్సిపల్ పక్కన ఉన్న దేవాలయంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడారు. మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. బుధవారం నుంచి కార్మికులు విధులోకి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య, కార్యదర్శి కాసారపు శంకర్ నాయకులు భారతి, విజయ, పద్మ, మమత, రాజయ్య, అర్జున్, బాబా, కిషన్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

గంభీరావుపేట, జనవరి 23 : గంభీరావుపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 20 వేల రూపాయలు విలువ చేసే మైక్‌సెట్‌ను బహూకరించారు. లింగన్నపేట హెచ్ఎం గంగారాం, అంబారిపేట హెచ్ఎం శ్రీనివాస్, ముస్తాబాద్ బాలికల పాఠశాల హెచ్ఎం రవీందర్, మండల కేంద్రంలోని బాలుర పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రమ, శ్రీకాంత్‌రెడ్డి, రాజయ్య, శివకుమారస్వామి, కిషన్, రాజమల్లికార్జున్ కలిసి మైక్‌సెట్‌ను బహూకరించారు. మైక్‌సెట్‌ను అందించిన ఉపాధ్యాయులకు స్థానిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యూనియన్ బ్యాంకు సేవలపై అవగాహన

కోనరావుపేట, జనవరి 23: మండలంలోని మంగళపల్లెలో మంగళవారం యూనియన్ బ్యాంకు వేములవాడ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థులకు బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు లావాదేవీలు, అప్పులు, బ్యాంకు చేస్తున్న సేవలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మారుతి, ఉపసర్పంచ్ అవురం శరత్, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు స్థలం కేటాయించాలి


ధర్నా చేస్తున్న లక్ష్మీపూర్ గ్రామస్థులు

తంగళ్లపల్లి, జనవరి 23: మౌలిక వసతులకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లడుతూ గ్రామంలో గతంలో శ్మశాన వాటిక, కంపోస్టుషెడ్, హరితహారం మొక్కల పెంపకం కోసం స్థలం కేటాయించగా అవి కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం మౌలిక వసతుల కోసం కేటాయించిన స్థలం గుండా రైల్వేలైన్ వెళ్తుందన్నారు. రైల్వేలైన్‌లో కోల్పోతున్న స్థలానికి బదులు మరోచోట స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఆర్డీవోలకు వినతిపత్రం సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

బాధిత రైతుకు చెక్కు అందజేత

చందుర్తి, జనవరి 23: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట మల్లేశం అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా బాధిత రైతుకు సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు మంగళవారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెస్ సంస్థ ఆధ్వర్యంలో బాధిత రైతుకు రూపాయలు 40 వేల అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్, సర్పంచ్ గంగాధర్, కో ఆప్షన్ సభ్యులు కమలాకర్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మరాటి మల్లిక్, నాయకులు బైరగోని రమేష్, సెస్ గ్రామ ప్రతినిధి దశరథం, వార్డు సభ్యులు నరేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

చందుర్తి, జనవరి 23: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల బరువు, ఎత్తు పెరగడంపై తృప్తి సాధించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, మమత, కోఆర్డినేటర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఎంఎస్ యాప్‌పై అధికారులకు అవగాహన

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 23: కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఎన్నికల అధికారులకు మంగళవారం వీడియోకాన్ఫరేన్స్ ద్వారా ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఈఎస్ఎంఎస్) యాప్‌పై కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సంతోష్ ప్రతారియా అవగాహన కల్పించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సంతోష్ ప్రతారియా ఎన్నికల సంఘం రూపొందించిన ఈఎస్ఎంఎస్ యాప్‌ను అధికారులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోలన్నారు. అందులో ఎన్నికల సందర్భంగా డబ్బులు, మద్యం ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రిని పట్టుకొని వాటి వివరాలను ఇందులో అప్‌లోడ్ చేసే విధానం, వాహనాలను తనిఖీ చేసే పద్ధతిపై జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలెన్స్ స్టాటిస్టికల్ టీమ్ అధికారులకు అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, జిల్లా ఐటీ నోడల్ అధికారి ఎండీ రఫీ, జిల్లా వ్యయ పరిశీలక నోడల్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవంపై కవి సమ్మేళనం

సిరిసిల్ల రూరల్, జనవరి 23: గణతంత్ర దినోత్సవంపై తెలంగాణ రచయితల వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఈ నెల 26న కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి అడెపు లక్ష్మణ్‌లు తెలిపారు. సిరిసిల్లలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా గ్రంథాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కవి సమ్మేళనానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రముఖ రాజకీయ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి బుగ్గారెడ్డి, డీపీఆర్వో దశరథం హాజరవుతున్నారని తెలిపారు. ఈ కవి సమ్మేళనంతో తెలంగాణ రచయితల వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఎంపిక చేసిన కవులు మాత్రమే పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి కవులు, కళాకారులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంగళ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరగోని చైతన్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి పాకాల శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.


'రైతులను వేధిస్తున్న విద్యుత్ అధికారులు'

సిరిసిల్ల టౌన్, జనవరి 23: జిల్లాలోని రైతులను విద్యుత్ అధికారులు పలు రకాలుగా వేధిస్తున్నారని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు ఆరోపించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సత్యసాయి సేవా మందిరం ఆవరణలో భారతీయ కిసాన్ సంఘ జిల్లా ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ జిల్లా నాయకులు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించే విధంగా భారతీయ కిసాన్ సంఘ్ కృషి చేయాలన్నారు. పండించిన ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024-27 సంవత్సరాలకు జిల్లాలోని అన్ని మండలాల భారతీయ కిసాన్ సంఘ్ 10వేల సభ్యత్వాలను చేయించాలన్నారు. అనంతరం సిరిసిల్ల, వేములవాడ డివిజన్‌లకు ఇంచార్జీలుగా రామాగౌడ్, లక్ష్మారెడ్డిలను ఎన్నుకున్నారు. రెండు డివిజన్‌లలో సభ్యత్వ అభియాన్ చేయించే విధంగా బాధ్యతలను అప్పగించారు. ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు సభ్యత్వాలను పూర్తి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి, కోశాధికారి లింగనోళ్ల మాణిక్యరెడ్డి, కరీంనగర్ జోనల్ అధ్యక్షుడు సంపదరావు, జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ నాయకులు ఆడెపు రవీందర్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

తంగళ్లపల్లి, జనవరి 23: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ అన్నారు. మండలంలోని గండిలచ్చపేటలో ప్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాల్‌రావ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిస్లిల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావుతో కలిసి వైద్యాధికారి ప్రియాంక, ఏఎన్ఎంలతో సమావేశం అయ్యారు. అసుపత్రికి వస్తున్న కేసుల వివరాలతో పాటు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా జ్వరాలకు సంబంధిం చి తెలుసుకున్నారు. మిషన్- 80లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని అన్నా రు. గర్బిణులకు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. సుందరయ్య నగర్ అర్బన్ కేంద్రం ఆధ్వర్యంలో 29 ప్రసవాలు జరగగా 23 ప్రభుత్వ అసుపత్రు ల్లో ఆరు ప్రైవేటులో జరిగినట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, డాక్టర్ నయామా తదితరులు పాల్గొన్నారు.